క్లుప్తంగా

ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్‌రూరల్: గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం మావల మండలంలోని దుబ్బగూడలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఉత్సవాలకు హాజరైన ఆయనను గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు యాస్పు నర్సింగరావ్, మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, సంజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు

నేరడిగొండ: ఇంద్రవెల్లి అమరవీరుడు బాపురావు కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గుత్పాల గ్రామంలో గల స్థలంలో బుధవారం బాపురావు భార్య రూపబాయి చేతుల మీదుగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బోథ్ ఎంపీడీవో రమేశ్ బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. నాలుగు అంచెల్లో ప్రభుత్వం ఆర్థిక సాయం విడుదల చేస్తుందన్నారు. అనంతరం బిర్లాగొంది, నారాయణపూర్, అందూర్ గ్రామాల్లో తాగునీటి వనరులను పరిశీలించారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 98493 90495లో సంప్రదించాలన్నారు.

ఇచ్చోడ సీఐగా బండారి రాజు

ఇచ్చోడ: ఇచ్చోడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బండారి రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ భీమేశ్ రామగుండం కమిషనరేట్‌గా బదిలీ కాగా వరంగల్ నుంచి బండారి రాజు ఇచ్చోడ సీఐగా బదిలీపై వచ్చారు. ఈమేరకు సీఐ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్ గ్రామ సమీపంలో గల మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఏఎస్సై రాథోడ్ మారుతి బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని వరలక్ష్మీనగర్‌కు చెందిన పుస్నాక్ శ్యాం, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని నిషాన్‌ఘాట్‌కు చెందిన ఆత్రం కిరణ్‌లు నిషాన్‌ఘాట్ నుంచి ఆదిలాబాద్ మీదుగా జందాపూర్ గ్రామానికి వెళ్తున్నారు. జందాపూర్ గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

హమాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక

బోథ్: క్రాంతికారి హమాలీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం హమాలీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.శాలిక్ రావ్, ఉపాధ్యక్షుడిగా ఆడె విఠల్, ప్రధాన కార్యదర్శిగా అల్లుల సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

సిరికొండ: లైసెన్స్ కలిగిన సర్వేయర్లు శిక్షణ కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను 17వ తేదీలోగా సమర్పించాలన్నారు. లైసెన్స్ కలిగి ఉండి 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉండాలని పేర్కొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై హర్షం

సొనాల: మండలంలోని మేడిగూడ గ్రామంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మేడిగూడలో అధికారుల చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో పంట విక్రయించేందుకు మేడిగూడ, లక్ష్మీపూర్, పిప్పల్‌గావ్ గ్రామాల గుండా వ్యయప్రయాసలకోర్చి జైనథ్ మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. మేడిగూడలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో సంతోషంగా ఉందన్నారు.



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

లింగాపూర్: మండల కేంద్రం నుంచి పిట్టగూడ వెళ్లే ప్రధాన రహదారి పక్కన కేజీబీవీ కోసం నిర్మించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ కంచె లేకుండా, గద్దె ఏర్పాటు చేయకుండా, చేతులకు అందే ఎత్తులో ఉంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె, గద్దె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బురద రోడ్డుపై నడిచేదెలా?



పెంచికల్‌పేట్: మండలంలో బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి లోడుపల్లి –కొండపల్లి ప్రధాన రహదారి బురదమయంగా మారింది. ఇటీవల గుత్తేదారు రోడ్డు మరమ్మతులు చేపట్టాడు. బీటీ రహదారికి ఇరువైపులా మొరం వేశారు. భారీ వర్షానికి రోడ్డు బురదమయంగా మారింది. రోడ్డుపైన వెళ్లే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

తవ్వారు.. వదిలేశారు..!



లింగాపూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతోంది. ఇందులోభాగంగా మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలో నమూనా ఇల్లు నిర్మాణం కోసం అధికారులు స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ స్థలంలో గుంతలు తవ్వించి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు మాత్రం ప్రారంభించలేదు. దీంతో స్థానికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

సిబ్బంది కొరత.. సమస్యల రొద



పెసరికుంట గ్రామం

- ఉత్తమ 'పంచాయతీ'కి కార్యదర్శి కరువు
- మండలంలో మూడు పోస్టులు ఖాళీ
- ఇన్‌చార్జి కార్యదర్శులే దిక్కు
- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు

దహెగాం: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు. అలాంటి పల్లె పంచాయతీలకు కార్యదర్శులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని, సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కేంద్ర పంచాయతీరాజ్ శాఖ పెసరికుంట పంచాయతీని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసింది. ఉత్తమ పంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేక ఇన్‌చార్జి కార్యదర్శులతో నెట్టుకొస్తున్నారు. దీంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

229 కుటుంబాలు..

మండలంలోని పెసరికుంట గ్రామంలో 229 కుటుంబాలు ఉండగా సుమారు వెయ్యికి పైగా జనాభా ఉంది. నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీ ఇది. 2022 -23 సంవత్సరంలో పంచాయతీలు సాధించిన ప్రగతి ఆధారంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నిర్వహించిన సర్వేలో పెసరికుంటను ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసింది.



పెసరికుంట పంచాయతీ కార్యాలయం

పారిశుద్ధ్యం, తాగునీరు, పాఠశాల, అంగన్‌వాడీ తదితర అంశాలను పరిశీలించి ఉత్తమ జీపీగా ఎంపిక చేసింది.

దీర్ఘకాలిక సెలవుల్లో కార్యదర్శి..

పెసరికుంట పంచాయతీ కార్యదర్శి జనవరి నుంచి దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో ఉన్నతాధికారులు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించారు. ముందుగా దిగిడ, బీబ్రా పంచాయతీ కార్యదర్శులకు ఇన్‌చార్జి ఇవ్వగా వారు కొన్ని రోజులు విధులు నిర్వహించి తప్పుకున్నారు. ప్రస్తుతం ఐనం పంచాయతీ కార్యదర్శికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పెసరికుంట గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శులు విధులు నిర్వహించడం కష్టంగా మారిందని వాపోతున్నారు. పంచాయతీలలో నిధులు లేనందున రెగ్యులర్ పోస్టింగ్ ఉన్న జీపీకి ఖర్చు చేయాల్సి వస్తుందని, ఇన్‌చార్జి జీపీకి డబ్బులు ఎక్కడి నుంచి ఖర్చు చేయాలో అర్థం కాక ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారని తెలుస్తోంది. మండలంలోని పీపీరావు కాలనీ, కుంచవెల్లి పంచాయతీలకు కూడా రెగ్యులర్ కార్యదర్శులు లేక ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించారు. దీంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

అద్దె భవనంలో జీపీ కార్యాలయం..

నూతనంగా ఏర్పడిన పంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాల్లో, పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. గత సంవత్సరం పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. పెసరికుంట పంచాయతీ భవనం మంజూరైనా స్థలం లేక ఇంకా పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఉత్తమ పంచాయతీకి ఎంపికైనందున పక్కా భవనం నిర్మించడంతో పాటు, రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండలంలో ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల వివరాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పెసరికుంట, పీపీరావు కాలనీ, కుంచవెల్లి జీపీలలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు లేక ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.
– రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీవో, దహెగాం

మహాసభ జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్‌లో ఈ నెల 17న నిర్వహించనున్న మండల మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి పిలుపునిచ్చారు. మహాసభ సందర్భంగా బుధవారం పట్టణంలోని సందీప్‌నగర్ 1, 2 శాఖల మహాసభలు నిర్వహించారు. సందీప్‌నగర్ 1 శాఖ కార్యదర్శి దివాకర్, సందీప్‌నగర్ 2 శాఖ కార్యదర్శి గణేశ్‌లు పార్టీ జెండా ఆవిష్కరించి శాఖ సభలను ప్రారంభించారు. చిరంజీవి మాట్లాడుతూ సీపీఐ 100 సంవత్సరాలుగా పేద ప్రజల హక్కుల కోసం, భూమికోసం, భుక్తి కోసం పోరాటం చేస్తుందన్నారు. ప్రజల కోసం అనేక త్యాగాలు చేసిన చరిత్ర ఉందని, కేవలం ఓట్లు, సీట్ల కోసం కాకుండా ప్రజల సేవ కోసం పని చేసే పార్టీ సీపీఐ మాత్రమే అన్నారు. నాయకులు డోన్నాజీ, సిద్దక్క, భాస్కర్, మహేశ్, సంతోష్, సుధాకర్, శ్రీకాంత్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏడేళ్లుగా అంబలి పంపిణీ

రెబ్బెన: ప్రజలకు నిత్యం సేవ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్. ఏటా వేసవిలో అంబలి పంపిణీ ద్వారా ఎంతో మంది ఆకలి తీరుస్తున్నాడు. వేసవికాలం మొదలు నుంచి వర్షాలు ప్రారంభమయ్యే వరకు అంబలి పంపిణీ కొనసాగిస్తున్నారు. ఏడేళ్ల క్రితం ఇందిరానగర్‌లో గ్రామస్తులకు, ఆలయానికి వచ్చే భక్తుల కోసం మొదలైన ఈ కార్యక్రమం నేడు వందలాది మంది ఆకలి తీర్చే స్థాయికి చేరుకుంది. కష్టతరమైన ఈ పనిలో దేవార వినోద్ స్వామి కుటుంబ సభ్యులు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. వినోద్ తల్లిదండ్రులు లక్ష్మి, నారాయణతో పాటు భార్య వీణ అంబలి పంపిణీని తమ భుజాలపై వేసుకుని విజయవంతం చేస్తున్నారు. ప్రతీరోజు సుమారు 50 కిలోల జొన్నలను ఉపయోగించి 500 లీటర్లపైనే అంబలి తయారు చేస్తున్నారు.

ఎన్నో అవార్డులు..

సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ దేవార వినోద్ ఎన్నో ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. దేవార వినోద్ యువసేన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేపట్టి స్వచ్ఛందంగా చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ అవార్డు అందించింది. శ్రీ జ్ఞాన సరస్వతీ దేవీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కోవిడ్ 19 ఉత్తమ సర్వీసు అవార్డు అందుకున్నారు. రెండేళ్ల క్రితం కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవకుడిగా అవార్డు అందుకున్నారు. శిఖర ఆర్ట్స్ సంస్థ సామాజిక సేవా, ఆధ్యాత్మిక రంగం నుంచి ప్రతిష్ఠాత్మక నంది పురస్కారాన్ని అందించింది.



అంబలి పంపిణీ చేస్తున్న దేవార వినోద్

ఐకేపీ భవనాన్ని లైబ్రరీకి కేటాయించొద్దు

కౌటాల: మండల కేంద్రంలోని ఐకేపీ పాత భవనాన్ని గ్రంథాలయానికి కేటాయించొద్దని కోరుతూ బుధవారం స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులు, వీవోఏలు పాత భవనం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఐకేపీ కార్యాలయం నిర్వహించిన పాత భవనాన్ని గ్రంథాలయానికి కేటాయించడం సరికాదన్నారు. పాత భవనంలో చేపడుతున్న మరమ్మతు పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దండె విఠల్ పాత ఐకేపీ కార్యాలయానికి చేరుకొని పాత భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి వేరే భవనం ఇవ్వాలని, ఈ భవనాన్ని కేటాయించవద్దని మహిళల సభ్యులు ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన వెంటనే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పాత ఐకేపీ భవనంలో కాకుండా వేరే చోట గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మహిళ సంఘాల సభ్యులు, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు నాహీం, భాస్కర్, పోశం, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


బెజ్జూర్: పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని కుంటలమానేపల్లి నుంచి చింతలమానేపల్లి మండలం ఏటిగూడ మధ్య ఐటీడీఏ ద్వారా చేపడుతున్న బ్రిడ్జి, బీటీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, మురళి, గూడ రాకేశ్, తిరుపతి, మోహన్ తదితరులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

వాంకిడి: నిర్మల్ జిల్లాలో దళితులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని భారతీయ బౌద్ధ మహాసభ, అంబేడ్కర్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బుధవారం మాట్లాడారు. వైశాఖ బుద్ధ పౌర్ణిమను పురస్కరించుకుని దళితులందరూ బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోగా, కొందరు వారిపై చేయడం హేయమైన చర్య అన్నారు. నిందితులను అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అశోక్ మహోల్కర్ దుర్గ సందీప్, వినేష్, శాంరావు, లాహు, ప్రతాప్, సురేందర్, బల్వంత్, రోషన్, పోచాలు, మనోజ్, చింటు, స్వాగత్, సంజు, మోను, మారుతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్ మహోల్కర్

నర్సరీల్లో మొక్కలు పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

కౌటాల: గ్రామ పంచాయతీల్లో గల నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను పెంచాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని పార్డీ గ్రామంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, ఎండల బారిన మొక్కలు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాకాలంలో గ్రామంలో మొక్కలు నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, సిబ్బంది ఉన్నారు.

నేడు పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ

కౌటాల: కౌటాల మండలం కన్నెపల్లి ఎక్స్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను గురువారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. నేడు ఉదయం 10.30 గంటలకు నూతన విగ్రహాలను మాలీ సంఘం రాష్ట్ర నాయకులు ఆవిష్కరిస్తారని తెలిపారు. మండలంలోని మాలి సంఘం నాయకులు, పూలే అభిమానులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

మూగజీవాలను రవాణా చేస్తే చర్యలు

వాంకిడి(ఆసిఫాబాద్): అక్రమంగా మూగజీవాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రశాంత్ హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణను కట్టడి చేసేందుకు వాంకిడి సరిహద్దు (ఆర్టీఏ) చెక్‌పోస్ట్ వద్ద సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మూగజీవాలను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా అక్రమ రవాణాను అడ్డుకుని గొడవలు సృష్టించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువులను అక్రమంగా తరలించే అవకాశం ఉన్నందున పశు సంవర్ధక శాఖ అధికారుల సమన్వయంతో అడ్డుకుంటామని అన్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తామన్నారు. సరైన ధ్రువపత్రాలు లేకుంటే కేసు నమోదు చేసి, పశువులను గోశాలకు తరలిస్తామని తెలిపారు. రహదారిపై పశువులు కనిపించినా వాటిని గోశాలకు తరలిస్తామన్నారు.



చెక్‌పోస్టు వద్ద ఎస్సై ప్రశాంత్

వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఎన్నిక

బెజ్జూర్: మండలంలోని లంబాడిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని (కుడ్మేతవాడ) శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీని గ్రామస్తులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఆలయ కమిటీ అధ్యక్షుడిగా భూక్యా సంతోష్ నాయక్, ఉపాధ్యక్షుడిగా ఆత్రం సకారాం, కార్యదర్శిగా సపావట్ భిక్షపతి నాయక్, కోశాధికారిగా ఆలం మల్లయ్య, కమిటీ సభ్యులుగా కోరేత శ్రీనివాస్, ఆత్రం మల్లేశ్, కొమరంపొట్టి, ఎనుక నాగయ్య, కందుగుల శేఖర్‌లను ఎన్నుకున్నారు.



కమిటీని ఎన్నుకుంటున్న గ్రామస్తులు

రేషన్ బియ్యం అమ్మితే కార్డు తొలగించాలి

ఆసిఫాబాద్‌రూరల్: రేషన్ బియ్యం అమ్ముకునే లబ్ధిదారుల కార్డులు రద్దు చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆర్డీవో లోకేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో బియ్యం కొనుగోలు చేయకపోవడంతో లబ్ధిదారులు పట్టణ ప్రాంతాలకు వెళ్లి అక్కడే అమ్ముకుంటున్నారని తెలిపారు.

కనిపించని ఆచూకీ

కెరమెరి: మండలంలోని వడ్డేరగూడకు చెందిన సెర్ల లక్ష్మణ్(28) ఆచూకీ ఐదు రోజులుగా కనిపించడం లేదని అతని తండ్రి సెర్ల అశోక్ తెలిపాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మణ్ ఇప్పటివరకు ఇంటికి రాలేదన్నారు. ఎవరికైనా కనిపిస్తే 99123 01125, 79936 41553 నంబర్‌లలో సమాచారం అందించాలన్నారు.



సెర్ల లక్ష్మణ్

నాసిరకం మొరం వాడొద్దు

జైనథ్: బేల మండల సరిహద్దు నుంచి బోరజ్ మండలం వరకు అంతర్రాష్ట్ర రహదారుల పనులు కొనసాగుతున్నాయి. జైనథ్ మండల కేంద్రం వద్ద రోడ్డు పనుల్లో నాసిరకం మొరం వాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ వాడకుండా మట్టి రాళ్లను వాడుతున్నారన్నారు. జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, నాయకులు హనుమంత్ రెడ్డి, రాజారెడ్డి ఉన్నారు.



రోడ్డు పనులు అడ్డుకున్న మండల కాంగ్రెస్ నాయకులు